సాక్షి జోగులాంబ గద్వాల

శుక్రవారం । 8 । సెప్టెంబర్ । 2023



జూరాలకు తగ్గిన ఇన్ ఫ్లో

ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం వస్తున్న ఇన్‌ఫ్లో తగ్గింది.

వివరాలు 10లో ▸



కర్ణాటక ఫలితాలే..

కర్ణాటక ఫలితాలే తెలంగాణతోపాటు నాలుగు రాష్ట్రాల్లో వస్తాయని వంశీచంద్‌రెడ్డి అన్నారు.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
32.8 /23.0

వాతావరణం

ఆకాశం కొంత మేర మేఘావృతమై ఉంటుంది. సాయంత్రం, రాత్రి సమయంలో ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ప్రతి ఇంటి నుంచి మట్టి సేకరించడమే లక్ష్యం



మల్దకల్/ధరూరు: గ్రామాలలో ప్రతి ఇంటి నుంచి పిడికెడు మట్టి సేకరించడమే బీజేపీ పార్టీ ప్రధాన లక్ష్యమని బీజేపీ పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ అన్నారు. గురువారం మల్దకల్, ధరూరు మండలాల్లో మట్టి సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా సెప్టెంబర్ 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు చేపట్టిన ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అనేక అభివృద్ధి సంక్షేమ పథకాలను గ్రామాల్లో ప్రజలకు వివరించాలన్నారు. ఈ ఎన్నికల్లో బీజేపీ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు ప్రతి కార్యకర్త పనిచేయాలన్నారు. నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, రామచంద్రారెడ్డి, పాల్వాయి రాముడు, శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, రామకృష్ణ, ఉషేన్ తోపాటు సంజీవ్ భరద్వాజ, రాజేష్, వెంకటేశ్వరరెడ్డి, కిష్టన్న, నరేందర్‌రెడ్డి, ప్రతాప్ పాల్గొన్నారు.

'సమగ్ర శిక్ష' ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

గద్వాల: జిల్లాలోని విద్యాశాఖలో పనిచేస్తున్న సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులను తక్షణం క్రమబద్ధీకరించాలని వివిధ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. తమకు న్యాయం చేయాలని, తమ ఉద్యోగ జీవితాలకు భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన ధర్మదీక్ష గురువారం మూడో రోజు కొనసాగింది. కాంగ్రెస్ పార్టీల నాయకులతో పాటు జిల్లా గెజిటెడ్ హెచ్‌ఎం సంఘం నాయకులు వేర్వేరుగా మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడారు. 20 ఏళ్లుగా పనిచేస్తూ గురుకులాలతో సమానంగా ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నా శ్రమకు తగిన వేతనం ఇవ్వడం లేదని విమర్శించారు. సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయకుంటే ప్రభుత్వంపై సమరం సాగిస్తామని హెచ్చరించారు. ప్రతి ఉద్యోగికి జీవిత బీమా, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలన్నారు. జిల్లా గెజిటెడ్ హెచ్‌ఎంల సంఘం నాయకులు రాజు, ప్రతాప్‌రెడ్డి మాట్లాడారు. ఎంఈఓ సురేష్, జీహెచ్‌ఎం పరమేశ్వర్‌రెడ్డి, నరేష్‌తోపాటు హుస్సేనప్ప, గోపాల్, జనార్దన్, ఖాజా, సమి, శ్యామ్, శ్రీనివాసులు, శేషన్న పాల్గొన్నారు.

ఆశలపై నీళ్లు..!

ప్రతికూల వర్షాభావ పరిస్థితుల్లో తుమ్మిళ్ల ఎత్తిపోతల పంపింగ్ కష్టమే..



తుమ్మిళ్ల అప్రోచ్ కెనాల్‌లో పంపింగ్‌కు అందని నీటి స్థాయి

- సాగునీరు అందక ఆర్డీఎస్ ఆయకట్టు రైతుల సతమతం
- గతేడాది ఈ సమయానికే తుమ్మిళ్ల ద్వారా నీటి విడుదల
- ప్రస్తుతం పంపింగ్‌కు కూడా సరిపోని నీరు
- ఆందోళనలో జిల్లా రైతాంగం



తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం

రాజోళి: ప్రతికూల వర్షాభావ పరిస్థితుల కారణంగా ఆర్డీఎస్ రైతుల్లో ఆందోళన మొదలైంది. జిల్లాలో సరైన వర్షాలు కురవకపోయినా ఎగువన ఉన్న కర్ణాటకలో వర్షాలు కురిస్తే ఆర్డీఎస్ ఆయకట్టుకు సాగు నీరందే అవకాశాలుంటాయి. కానీ ఈ ఏడాది అంతంత మాత్రంగా కూడా వర్షాలు కురవకపోవడంతో రైతులు సందిగ్ధంలో పడ్డారు. ఎగువన కురిసిన వర్షాలతో అక్కడున్న ప్రాజెక్టులకు నీరు పుష్కలంగా రావడంతో నీరు దిగువకు వచ్చేది. దీంతో తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం, ఆర్డీఎస్ ఆయకట్టుకు సాగు నీరందేది. కానీ ఈ ఏడాది సీజన్ ప్రారంభమై నెలలు గడుస్తున్నా ఇంతవరకు వర్షాలు కురవకపోవడంతో ప్రాజెక్టులన్నీ నోరు వెళ్లబట్టాయి.

2వేల నుంచి 3వేల క్యూసెక్కుల వరకు..

గతేడాది తుమ్మిళ్లకు ఎగువ ఉన్న ప్రాజెక్టులు, నీటి వనరుల ద్వారా రోజూ 2వేల నుంచి 3వేల క్యూసెక్కుల వరకు వరద నీరు సుంకేసుల వరకు వచ్చేది. దీంతో తుమ్మిళ్ల ఎత్తిపోతలకు, కేసీ కెనాల్‌కు సాగు నీరు అందేది. ప్రస్తుతం ఎగువ నుంచి చుక్క నీరు రాకపోవడంతో తుమ్మిళ్ల ఎత్తిపోతల మోటార్లు నేటి వరకు ప్రారంభం కాలేదు. గత ఏడాది ఆగస్టు 8న తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం మోటార్లు ఆన్ చేసి నీరు విడుదల చేశారు. దీంతో ఆయకట్టుకు నీరు అంది రైతులకు ఇబ్బందులు కలగలేదు. కానీ ప్రస్తుతం ఇంత వరకు నీరు రాకపోవడంతో రానున్న రోజుల్లో పరిస్థితి ఎలా ఉంటుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం కర్ణాటకలలోని టీబీ డ్యాంలో 72 టీఎంసీల నీరు ఉంది. అయినప్పటికీ అక్కడి నుండి నీరు కిందకు రావడం లేదు. గడిచిన ఏడాదిలో ఆర్డీఎస్ కట్ట నుంచి రోజూ కనీస మోతాదులో నీరు ఇన్‌ఫ్లో వచ్చేది. కానీ ఈ ఏడాది ఎగువ నుండి వచ్చిన నీరు.. అక్కడి పరిధిలోని పంటలకే సరిపోతుంది. పైగా అక్కడ కూడా వర్షాభావ పరిస్థితుల కారణంగా వారబందీ నడుస్తుండటంతో కనీసం రీజనరేట్ వాటర్ కూడా రావడం లేదు. టీబీ డ్యాం కింద ఉన్న కాలువలు, చిన్న పాటి ఎత్తిపోతల స్కీంలకే ఆ నీరు సరిపోతుంది. దీనికితోడు వాతావరణంలో ఉన్న వేడి, వర్షాలు కురవని కారణంగా భూమిలో తేమ శాతం లేక వచ్చిన నీరు వచ్చినట్లుగా రైతులు తడి పెడుతున్నారు. దీంతో నీరు వృథా అయ్యే పరిస్థితి లేకపోవడంతో నీరు రీజనరేట్ కావడం లేదు. భూమిలో తేమ ఉన్నట్‌లైతే రైతులు తడులు ఎక్కువ పెట్టకుండా నీటిని కెనాల్, వాగుల్లోకి వదిలేస్తారు. ఆ నీరు నదిలో చేరి దిగువ దాకా వచ్చేది. ప్రస్తుతం అలా వృథా అయ్యే నీరు కూడా లేకపోవడం, మిగిలిన కొద్దిపాటి నీరు కూడా ఎగువనే ఉన్న చిన్నపాటి లిఫ్టులకే సరిపోతుండటంతో తుమ్మిళ్ల ఎత్తిపోతల మోటార్లు ఇప్పటికి ఆన్ కాలేదు.

వర్షాలు లేక ఇబ్బంది



ఇక్కడ వర్షాలు కురవకపోయినా, ఎగువ నుండి వచ్చే నీటితో తుమ్మిళ్ల ద్వారా నీరు ఎత్తిపోస్తారనుకున్నాం. కానీ వర్షాలు లేని కారణంగా నదిలో నీరు లేకపోవడంతో తుమ్మిళ్ల మోటార్లు కూడా ఆన్ చేయడం లేదు. గతేడాది ఈ సమయానికి మోటార్లు ఆన్ చేయడంతో సాగు నీరు అందింది. ప్రస్తుతం వర్షాలు ఇక్కడ లేక. ఎగువ నుండి నీరు రాక పరిస్థితి దారుణంగా ఉంది.

– పరమేష్ గౌడ్, పెద్దదన్వాడ

నీరందే అవకాశం లేకుండా పోయింది



ఎగువ ప్రాజెక్టుల ద్వారా నీరు వచ్చేందుకు సరైన వర్షాలు లేవు. ప్రాజెక్టుల్లో ఉన్న కొద్దిపాటి నీరు కూడా కర్ణాటక పరిధిలోని చిన్న పాటి లిఫ్టులకు, పంటలకు సరిపోతుంది. అక్కడ కూడా నీటి ఎద్దడి కారణంగా వారబంది నడుస్తుండటంతో రీజనరేట్ వాటర్ కూడా రావడం లేదు.

– విజయ్‌కుమార్ రెడ్డి, ఆర్‌డీఎస్ ఈఈ


40వేల ఎకరాలకు నీరందించడం లక్ష్యం..

తుమ్మిళ్ల ఎత్తిపోతల ద్వారా ఆర్డీఎస్ ఆయకట్టు కింద 40 వేల ఎకరాల నీరందించే లక్ష్యంగా అధికారులు ప్రణాళిక రూపొందించారు. ఇదే ప్రణాళిక ప్రకారం అనుకున్న మేర గతేడాది నీరు కూడా అందించారు. అప్పుడు ఆగస్టు నుంచి మోటార్లు రన్ చేస్తే అనుకున్న మేర లక్ష్యాన్ని చేరుకున్నామని, ఇప్పటివరకు ఇంకా మోటార్లు ఆన్ చేయకపోతే అందులో సగమైనా నీరు అందుతుందా అనే అనుమానం ఇటు రైతుల్లో, అటు అధికారుల్లో కలుగుతుంది. వర్షాలు జిల్లాలో కాకపోయినా, కర్ణాటకలోనైనా కురిసి ఉంటే ఆర్‌డీఎస్ ఆయకట్టులో కనీసం ఇప్పటివరకే వేల ఎకరాలకు సాగు నీరందేదని, పంటలు ఎండిపోకుండా ఊపిరి పోసే అవకాశముండేదని రైతులు అంటున్నారు. తుంగభద్ర నదికి వరద వస్తే సుంకేసుల డ్యాం నుంచి బ్యాక్ వాటర్ తుమ్మిళ్ల దగ్గరకు వచ్చి చేరుతుంది. కానీ బ్యాక్ వాటర్ కూడా వచ్చి, స్టోరేజీ నిలబడే పరిస్థితి అక్కడ కనిపించడం లేదు. జీరో పాయింట్, అప్రోచ్ కెనాల్ వద్ద అడుగు మేర కూడా నీరు లేదు. కనీసం 2,500 క్యూసెక్కుల నీరు ఉంటే మోటార్లు ఆన్ చేసే అవకాశముంటుంది. అడుగంటిన నీటితో పంపింగ్ చేయడం సాధ్యమయ్యే పని కాదని అధికారులు అంటున్నారు. ఇప్పటికి కూడా జిల్లాలో, కర్ణాటక పరిధిలో వర్షాలు పడకపోతే పరిస్థితి దారుణంగా ఉంటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇక్కడ వర్షాలు కురవపోయినా తుమ్మిళ్ల లిఫ్టుపైనే గంపెడాశలు పెట్టుకుంటే, అవి కూడా ఆవిరైపోతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు.

కూలీ బతుకుల్లో పిడుగు



మృతదేహాల వద్ద రోదిస్తున్న మృతుల కుటుంబ సభ్యులు (ఫైల్)



'తెల్లవారుజాము నుంచి చిరు జల్లులు.. రెక్కాడితే గాని డొక్కాడని అన్నదమ్ముల కుటుంబాలకు చెందిన ఐదుగురు ఓ వ్యవసాయ పొలంలో కూలీకి వెళ్లారు.. పనులు చేస్తూ మధ్యాహ్నం కావడంతో అందరు కలిసి భోజనం చేశారు.. ఇంతలో ఉరుములు, మెరుపులతో వర్షం జోరందుకోవడంతో అక్కడే ఉన్న ఓ చెట్టు చెంతన చేరారు.. సరిగ్గా 1.20 గంటలు.. ఆకాశంలో ఒక్కసారిగా పెద్ద శబ్దం.. అటుఇటు చూసే లోపే ముగ్గురు కుటుంబ పెద్దలను పిడుగు రూపంలో మృత్యువు కబళించింది. మరో ఇద్దరు గాయాలతో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు.' వనపర్తి జిల్లా మక్తల్ నియోజకవర్గంలోని ఆత్మకూర్ మండలం బాలకిష్టాపూర్‌లో 2017 జూన్ 16న చోటుచేసుకున్న విషాద ఘటన ఇది. ఈ దుర్ఘటన జరిగి ఆరేళ్లకు పైగా కావొస్తున్నా.. బాధితులకు ఇప్పటివరకు ఎలాంటి పరిహారం అందలేదు. ఫలితంగా ఆ కుటుంబాలు చెల్లాచెదురు కాగా.. వీధిన పడ్డాయి. అప్పుల ఊబిలో కూరుకుపోయి విలవిల్లాడుతున్నాయి. దిక్కుతోచని స్థితిలో సర్కారు సాయం కోసం వేయి కళ్లతో ఎదురుచూస్తున్నాయి.

– సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్

- అన్నదమ్ముల కుటుంబాల్లో ముగ్గురి దుర్మరణం
- ఆరేళ్లుగా బాధితులకు అందని సాయం
- పెద్ద దిక్కును కోల్పోయి దయనీయస్థితిలో జీవితాలు
- ఆదుకోని ఆపద్బంధు.. దరిచేరని ప్రభుత్వ పథకాలు
- కనీసం గృహలక్ష్మి వర్తింపజేయాలని వేడుకోలు

మృతుల కుటుంబ నేపథ్యం..

పిడుగుపాటుకు బలైన వారు తెలుగు లక్ష్మణ్ణ (40), వాకిట ఈదన్న (52), తెలుగు పరమేష్ (27). గాయపడిన వారు కొండన్న, శివ. మృతుడు తెలుగు లక్ష్మణ్ణకు భార్య లక్ష్మితో పాటు ముగ్గురు కూతుళ్లు, ఓ కుమారుడు ఉన్నారు. మరో మృతుడు ఈదన్నకు భార్య మణెమ్మతో పాటు ముగ్గురు కూతుళ్లు, ఇద్దరు కుమారులు. మృతుడు పరమేష్‌కు భార్య జయమ్మ (బంగారమ్మ)తో పాటు కూతురు ఉన్నారు. పెద్ద దిక్కును కోల్పోయిన ఈ కుటుంబాలు ప్రస్తుతం దయనీయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాయి. మణెమ్మ, జయమ్మ కూలి పనుల కెళ్తూ, లక్ష్మి పండ్లు అమ్ముకుంటూ కుటుంబాలను సాకుతున్నారు. పిల్లల చదువులు, పెళ్లిళ్లు, ఆస్పత్రుల ఖర్చులు తడిసిమోపెడు కాగా.. అప్పులతో కాలం వెళ్లదీస్తున్నారు.

కూలీ పనులు చేస్తూ..



ఈ ఫొటోలో ఉన్న మహిళ మృతుడు వాకిటి ఈదన్న భార్య మణెమ్మ. పెద్ద దిక్కుగా ఉన్న భర్త చనిపోయిన తర్వాత కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని సాకుతోంది. గత ఏడాది కూలీ పనులకు ఆటోలో వెళ్తున్న క్రమంలో ప్రమాదం చోటుచేసుకుంది. ఆమె కాలు విరగ్గా.. ఆస్పత్రి పాలైంది. ప్రస్తుతం ఆమె ఎలాంటి పనులు చేయలేని స్థితిలో భారంగా కాలం వెళ్లదీస్తోంది. ఓ కుమారుడు ఇటీవల అప్పు చేసి ఆటో కొన్నాడు. ఇదే వారికి జీవనాధారంగా మారింది.

బతుకు భారమైంది..

పిడుగుపాటుతో నా భర్త చనిపోయిన తర్వాత మా బతుకు భారమైంది. రూ.3 లక్షల వరకు అప్పు అయింది. ఆపద్బంధు సాయం కోసం దరఖాస్తు చేసుకుని, ఏడేళ్లుగా కార్యాలయాలు చుట్టూ తిరుగుతున్నాం. ఎవరూ పట్టించుకోవడం లేదు. వితంతు పింఛన్ మినహా మాకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందలేదు. పరిహారం అందజేయాలని వేడుకుంటున్నా.

– మణెమ్మ, మృతుడు వాకిటి ఈదన్న భార్య

పండ్లు అమ్ముకుంటూ..



మృతుడు తెలుగు లక్ష్మణ్ణకు భార్య లక్ష్మి ఆత్మకూర్‌లో ఫుట్‌పాత్‌పై పండ్లు అమ్ముకుంటూ జీవనం సాగిస్తోంది. లక్ష్మణ్ణ చనిపోయే నాటికి పెద్ద కూతురు వివాహం కాగా.. ఈ మధ్య కాలంలో మిగతా ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడి పెళ్లి చేసింది. కొడుకు ఆటో నడుపుతూ ఆమెకు చేదోడువాదోడుగా నిలుస్తున్నాడు. పెళ్లిళ్ల కోసం రూ.2 లక్షల అప్పు అయిందని.. నా భర్త ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని వాపోతోంది.

ఖర్చు పెట్టినా.. పైసలు రాలే..

నా భర్త పిడుగుపడి చనిపోవడంతో నాకున్న నలుగురు పిల్లలను పోషించుకునేందుకు అష్టకష్టాలు పడ్డా. సర్కారు నుంచి ఆపద్బంధు పైసలు వస్తాయని చెప్పారు. ఆఫీసులకు తిరగడానికి ఖర్చు అవుతుందని చెప్పడంతో వెయ్యి రూపాయల చొప్పున రెండు సార్లు ఇచ్చిన. ఇప్పటివరకు ఆ పైసలు రానేలేదు. మా గురించి పట్టించుకునేవారే లేరు. మా పరిస్థితి చూసైనా సర్కారు ఆదుకోవాలి. గృహలక్ష్మి కింద ఇల్లు కట్టుకునే అవకాశం కల్పించాలి.

– లక్ష్మి, మృతుడు తెలుగు లక్ష్మణ్ణ భార్య

దయనీయం.. జయమ్మ జీవనం..



మృతుడు తెలుగు పరమేష్ భార్య జయమ్మ (బంగారమ్మ) దుర్భర పరిస్థితుల్లో జీవనం సాగిస్తోంది. భర్త చనిపోయే నాటికి వారికి రెండు నెలల కూతురు ఉంది. ప్రస్తుతం ఉండడానికి ఇల్లు కూడా సరిగా లేదు. ఓ పూరి గుడిసెలో తన కూతురుతో కలిసి తలదాచుకుంటోంది. పాప వయసు ఇప్పుడు ఆరేళ్లు కాగా.. కూలీ పనులకెళ్తూ బాలకిష్టాపూర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తోంది. పాపకు సుస్తీ కావడం.. గుడిసెకు పలు మార్లు రిపేరు, గతంలో తీసుకున్న వాటికి వడ్డీ కలిపి మొత్తం రూ.2లక్షల అప్పు ఉంటుందని ఆమె ఆవేదన వ్యక్తం చేస్తోంది. ప్రభుత్వం నుంచి వచ్చే పరిహారం కోసం ఎదురు చూస్తోంది.

నాలాంటి పరిస్థితి ఎవరికీ రావొద్దు..

నా పెళ్లి అయిన ఏడాదిన్నరకే నా భర్తను పిడుగు రూపంలో మృత్యువు బలి తీసుకుంది. ఆ తర్వాత నా బతుకు ఛిద్రమైంది. కొన్ని రోజులు మంచి, చెడు పట్టించుకున్న బంధువులు.. ఆ తర్వాత కానరాని పరిస్థితి ఉంది. నా బిడ్డ కోసమే జీవిస్తున్నా. పోషించుకునేందుకు రోజు కూలీ పని చేసుకుంటున్నా. నేను నివాసముంటున్న గుడిసె పూర్తిగా పాడైంది. నాలాంటి పరిస్థితి ఏ ఆడ కూతురుకీ రాకూడదు. ప్రభుత్వం పరిహారమందిస్తే.. కనీసం గుడిసెనైనా బాగు చేసుకుంటా.

– జయమ్మ, మృతుడు తెలుగు పరమేష్ భార్య

కుటుంబ పాలనలో గద్వాలకు అన్యాయం



మాట్లాడుతున్న ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్

గద్వాల అర్బన్: దశాబ్దాల కుటుంబ పాలనలో గద్వాలలో అవినీతి, అక్రమాలు, అరాచకాలు పెరిగిపోయాయని.. తీరని అన్యాయం జరిగిందని ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ విమర్శించారు. రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో పాదయాత్ర ప్రారంభమై ఏడాది పూర్తయినా సందర్భంగా గురువారం జిల్లా కేంద్రంలో పాదయాత్ర చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో బీఆర్‌ఎస్ పార్టీ దళిత బంధు, బీసీ బంధు, గృహలక్ష్మి మాయమాటలతో మభ్యపెడుతున్నారన్నారు. కేంద్రంలోని బీజేపీ పార్టీ కులాలు, మతాల పేరుతో విద్వేషాలతో స్వార్థ రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్‌జోడో యాత్రతో కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిందని, రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించుతారని, త్వరలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడబోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గద్వాలలో జరుగుతున్న అన్యాయాలు, అక్రమాల పాలనకు చరమగీతం పాడే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు.

పాదయాత్రలో తోపులాట

గద్వాలలో చేపట్టిన పాదయాత్రలో వర్గాలుగా విడిపోయి పార్టీ నాయకులు ఒకరినొకరు తోసుకున్నారు. సంపత్‌కుమార్ జోక్యం చేసుకుని సముదాయించారు. జెడ్పీచైర్‌పర్సన్ సరిత, టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి విజయ్‌కుమార్, రాజీవ్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు పటేల్ ప్రభాకర్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, వీరుబాబు, నారాయణరెడ్డి ఉన్నారు.

పేదల అభ్యున్నతే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం



ఎర్రవల్లిలో బీఆర్‌టీయూ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ చల్లా, మందా జగన్నాథం

ఎర్రవల్లిచౌరస్తా: పేదల అభ్యున్నతే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి అన్నారు. గురువారం ఇటిక్యాల మండలంలోని ఎర్రవల్లి కూడలిలో బీఆర్‌టీయూ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జెండాను ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ అధికార ప్రతినిధి మందా జగన్నాథంతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదల అభ్యున్నతికి దేశంలో ఎక్కడా లేని విధంగా కల్యాణలక్ష్మి, ఆసరా పింఛన్లు, దళిత బంధు, బీసీ బంధు వంటి ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టిందన్నారు. రైతుల సంక్షేమం నిమిత్తం రైతు బంధు, రైతు బీమా, పంటలకు గిట్టుబాటు ధరలను కల్పించిందన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలే కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రిని చేస్తాయన్నారు. ఇదిలాఉండగా, శ్రీశైలం ప్రాజెక్టు వల్ల భూములను కోల్పోయిన కుటుంబాలకు 98జీఓ ప్రకారం ప్రభుత్వ ఉద్యోగాలను కల్పించాలని బాధితులు ఎమ్మెల్సీ చల్లాకు వినతి పత్రం అందజేశారు. జెడ్పీటీసీ సభ్యుడు హనుమంతురెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రంగారెడ్డి, నాయకులు మందా శ్రీనాథ్, లక్ష్మినారాయణరెడ్డి, శ్రీదర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, ఉపేందర్ పాల్గొన్నారు.

కృష్ణాష్టమి వేడుకల్లో..

ధర్మవరంలో కృష్ణాష్టమి వేడుకల్లో మందా జగన్నాథం హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రక్రియ షురూ

- ఉమ్మడి జిల్లాలో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు
- మొదలైన దరఖాస్తుల పరిశీలన
- గతంలో లబ్ధిపొందిన వారు మళ్లీ దరఖాస్తు చేసుకున్నట్లు ఆరోపణ



దరఖాస్తుల ప్రక్రియను పరిశీలిస్తున్న డీఈఓ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఉమ్మడి పాలమూరు జిల్లావ్యాప్తంగా ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ కొనసాగుతుంది. బుధవారం సాయంత్రం వరకు నేరుగా దరఖాస్తు చేసుకునే ప్రక్రియ ముగిసింది. జనవరి నెలలో దరఖాస్తు చేసుకున్న వారికి ఎడిట్ ఆప్షన్ ఇవ్వగా.. గతంలో దరఖాస్తు చేసుకోని వారికి నేరుగా దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. ఆయా దరఖాస్తులను గురువారం ఉదయం నుంచి అధికారులు మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలోని డైట్ కళాశాలలో పరిశీలిస్తున్నారు. గద్వాల, నారాయణపేటలో సైతం సర్టిఫికెట్ పరిశీలన కొనసాగింది. అయితే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన అంశాలను, డీఈఓ కార్యాలయంలో ఉపాధ్యాయులు సమర్పించిన ధ్రువపత్రాలను అధికారులు పరిశీలిస్తున్నారు.

గతంలో చేసుకున్నవారు.. మళ్లీ

సాధారణ టీచర్ ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ గాని ఒక్కసారి ప్రిఫరెన్స్ కేటగిరిలో దరఖాస్తు చేసుకుని పీహెచ్, మెడికల్, విడోస్, స్పౌజ్‌లు ఒక్కసారి వాడుకుని బదిలీ అయ్యాక మరో ఎనిమిదేళ్ల వరకు, హెచ్‌ఎంలు ఐదేళ్ల వరకు దరఖాస్తు చేసుకోవద్దు. అయితే చాలామంది 2018లో కూడా స్పౌజ్‌కు దరఖాస్తు చేసుకుని మళ్లీ ఈసారి కూడా స్పౌజ్ పాయింట్ల కోసం దరఖాస్తులు చేసుకున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. గతేడాది స్పౌజ్ పాయింట్లు పొందినవారు సర్వీస్ బుక్‌లో ఎంట్రీ చేయలేదని, అలాంటి ఎంఈఓలపై చర్యలు తీసుకోవాలని డీఈఓకు ఫిర్యాదు చేశారు. కొంతమంది పీహెచ్‌ఎం, హెల్త్ వంటి వాటిలో పాయింట్లు పొందేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తుంది.

ఉమ్మడి జిల్లాలో వచ్చిన దరఖాస్తులు ఇలా..

జిల్లా	దరఖాస్తులు
మహబూబ్‌నగర్	2,663
నాగర్‌కర్నూల్	2,478
వనపర్తి	1,639
జోగులాంబ గద్వాల	1,569
నారాయణపేట	1,469
మొత్తం	9,818

ఆధారాలతో చూపించాలి..



బుధవారం సాయంత్రం వరకు ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకున్నారు. గురువారం ఉదయం నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలిస్తున్నాం. ఎవరైనా తప్పుగా దరఖాస్తు చేసుకుంటే ఆధారాలతో చూపిస్తే చర్యలు తీసుకుంటాం.

– రవీందర్, డీఈఓ, మహబూబ్‌నగర్, నారాయణపేట

క్లుప్తంగా

బైక్ ఢీకొని యువకుడి దుర్మరణం


శేషయ్య(ఫైల్)

లింగాల: రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న తులసి శేషయ్య(30)ను బైక్ బలంగా ఢీ కొట్టడంతో ఆయన మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. అంబట్‌పల్లికి చెందిన శేషయ్య వేకువజామున 5:30 గంటల సమయంలో నడుచుకుంటూ వ్యవసాయ పొలానికి వెళ్తుండగా, లింగాల మార్గంలో గున్న మిట్ట సమీపంలో వెనుక నుంచి గణేష్ అతి వేగంగా బైక్ వస్తూ బలంగా ఢీ కొట్టాడు. దీంతో శేషయ్య తలకు బలమైన గాయాలు కావడంతో నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. మృతునికి భార్య రేణుక, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

డెంగీతో యువతి మృతి

దేవరకద్ర రూరల్: డెంగీతో యువతి మృతి చెందిన ఘటన గురువారం మండలంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగన్నపల్లికి చెందిన అశ్విని (22) హైదరాబాద్‌లో ఉంటూ ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తుంది. వారం రోజుల క్రితం యువతికి జ్వరం రావడంతో మందులు వాడినా తగ్గకపోవడంతో గ్రామానికి వచ్చింది. దీంతో తల్లిదండ్రులు ఆమెను చికిత్స కోసం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ డెంగీగా నిర్ధారించి చికిత్స అందించినా నయం కాకపోవడంతో మెరుగైనా చికిత్స కోసం హైదరాబాద్ తీసుకెళ్లగా, పరిస్థితి విషమించి మృతి చెందింది.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

చిన్నచింతకుంట: మండలంలోని లాల్‌కోటకు చెందిన ఎల్లేష్ గురువారం ఊకచెట్టు వాగు నుంచి ఇసుకను అక్రమంగా ట్రాక్టర్‌లో తరలిస్తుండగా, పోలీసులు పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. ఎల్లేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శేఖర్ తెలిపారు.


మద్దూరులో పాఠశాల విద్యార్థుల ర్యాలీ


చిన్నచింతకుంట మండలం కురుమూర్తి ఆలయంలో దోలారోహణ నిర్వహిస్తున్న పూజారులు


మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఊరేగిస్తున్న శ్రీకృష్ణుడి విగ్రహం

హే కృష్ణా.. ముకుందా


ఉట్టి కొడుతున్న బాలిక

శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను గురువారం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిపారు. పల్లె, పట్టణాలతోపాటు పలు పాఠశాలల్లో చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో అలరించారు. పలుచోట్ల ఉట్టి కొట్టే వేడుకలను జరిపారు. చిన్నారులు, యువకులు కృష్ణుడి వేషధారణలో ఉట్లు కొట్టేందుకు పోటీపడ్డారు. మహిళలు, ప్రజలు శోభాయాత్రలో కోలాటాలు, బొడ్డెమ్మలు, భజనలు చేస్తూ ఉత్సాహంగా పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్


నాగర్‌కర్నూల్ కలెక్టరేట్‌లో ఉట్టికొడుతున్న కలెక్టర్ ఉదయ్‌కుమార్ దంపతులు


మహబూబ్‌నగర్‌లో ఉట్లకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు


నారాయణపేట జిల్లా కేంద్రంలో ఉట్టి కొడుతున్న యువకులు


నారాయణపేట పట్టణంలోని ఓ పాఠశాలలో ఉట్టి కొడుతున్న చిన్నారులు


'పేట'లో 56 రకాల పిండి వంటలతో శ్రీకృష్ణుడికి నైవేద్యం

ఒత్తిడి తగ్గేనా..?

నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలో ఒకేఒక్క ఠాణా


జిల్లాకేంద్రంలో కొనసాగుతున్న పోలీస్‌స్టేషన్

- జాడలేని రూరల్, ఉమెన్, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లు
- ఏడేళ్లు గడిచినా ప్రతిపాదనలకే పరిమితం
- ధర్నాలు, నిరసన సమయాల్లో సిబ్బందికి తప్పని పాట్లు
- పోలీసుల కోసం ఫిర్యాదుదారుల ఎదురుచూపులు

నాగర్‌కర్నూల్ క్రైం: ప్రజల సంరక్షణే ధ్యేయంగా శాంతిభద్రతల పరిరక్షణ కోసం నిరంతరం శ్రమిస్తున్న పోలీసులు ఒత్తిడికి గురవుతున్నారు. అయితే నాగర్‌కర్నూల్ జిల్లాగా మారినా పోలీస్ శాఖలో తక్కువ సిబ్బంది ఉండటంతో పని భారం పెరుగుతోంది. జిల్లాకేంద్రంలో ప్రస్తుతం కేవలం ఒకే ఒక్క పోలీస్‌స్టేషన్ మాత్రమే ఉండటంతో ఉన్న సిబ్బందితో కాలం వెళ్లదీస్తూ ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా చూస్తున్నారు. నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీ పరిధి పెరగడంతోపాటు సమీప గ్రామాలను విలీనం కావడం, అలాగే జిల్లాకేంద్రంగా ఏర్పడటంతో అచ్చంపేట, కల్వకుర్తి, కొల్లాపూర్ ప్రాంతాల నుంచి ప్రజలు పెద్దఎత్తున కలెక్టరేట్, ఎస్పీ తదితర జిల్లా కార్యాలయాలకు వస్తుండటంతో ట్రాఫిక్ సమస్య రోజు రోజుకూ పెరిగిపోతుంది.

స్టేషన్ల ఏర్పాటు తప్పనిసరి

ప్రస్తుతం జిల్లాకేంద్రంలో పట్టణ పోలీస్‌స్టేషన్ మాత్రమే ఉండటంతో ఏడాదిలో దాదాపుగా 600కుపైగా కేసులు నమోదవుతున్నాయి. రూరల్ పోలీస్‌స్టేషన్, ట్రాఫిక్, ఉమెన్ పోలీస్‌స్టేషన్లు ఏర్పాటు చేస్తే కేసుల సంఖ్య తగ్గడంతోపాటు ప్రజలకు సత్వర న్యాయం అందించేందుకు వీలవుతుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కలెక్టరేట్ కార్యాలయంతోపాటు ఎక్కడైనా రాజకీయ పార్టీల నాయకులు ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహిస్తే తాడూరు, తెలకపల్లి, బిజినేపల్లి, తిమ్మాజీపేట మండలాల నుంచి పోలీసులను బందోబస్తు కోసం జిల్లాకేంద్రానికి రప్పిస్తుండటంతో పోలీస్ స్టేషన్లకు తమ సమస్యల పరిష్కారం కోసం వచ్చే బాధితులు అధికారుల కోసం ఎదురు చూడాల్సి వస్తుంది.

తక్కువ సిబ్బందితో..

నాగర్‌కర్నూల్ పోలీస్‌స్టేషన్‌లో ప్రస్తుతం ఇద్దరు ఎస్‌ఐలు, ముగ్గురు ఏఎస్‌ఐలు, 24 మంది కానిస్టేబుళ్లతో విధులు నిర్వహిస్తుండటంతో పనిభారం ఎక్కువ అవుతుంది. ట్రాఫిక్ విభాగంలో ఒక ఎస్‌ఐ, ఒక ఏఎస్‌ఐతోపాటు ముగ్గురు కానిస్టేబుళ్లు విధులు నిర్వహిస్తున్నారు. జిల్లాకేంద్రంలో 45 వేల జనాభా ఉండగా నాగర్‌కర్నూల్ మండలంలోని 19 గ్రామ పంచాయతీల పరిధిలోని 22 గ్రామాల్లో 35 వేలకుపైగా జనాభా ఉంది. నాగర్‌కర్నూల్ పట్టణంతోపాటు మండలంలోని ఆయా గ్రామాల్లో శాంతిభద్రతల సమస్య తలెత్తితే ఉన్న సిబ్బందే ఫిర్యాదుదారుల సమస్యల పరిష్కరించాల్సిన పరిస్థితి ఉంది. త్వరగా నాగర్‌కర్నూల్‌లో ట్రాఫిక్, రూరల్, ఉమెన్ పోలీస్‌స్టేషన్లు ఏర్పాటు చేసేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఉమ్మడి జిల్లాకేంద్రంలో..

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి నాగర్‌కర్నూల్ వేరు పడి 7 సంవత్సరాలు గడుస్తున్నా.. ఇప్పటికీ రూరల్, ట్రాఫిక్, ఉమెన్ పోలీస్‌స్టేషన్లు ఏర్పాటు చేయకపోవడంతో పలు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఉమ్మడి జిల్లాలోని మహబూబ్‌నగర్, వనపర్తి, గద్వాలలో ట్రాఫిక్, రూరల్ పోలీస్‌స్టేషన్లు కొనసాగుతున్నా.. నాగర్‌కర్నూల్‌లో మాత్రం ఆయా పోలీస్‌స్టేషన్లు ప్రతిపాదనలకే పరిమతమయ్యాయి.

ప్రతిపాదనలు పంపించాం..



జిల్లాకేంద్రంలో రూరల్, ట్రాఫిక్, ఉమెన్ పోలీస్‌స్టేషన్ల ఏర్పాటు కోసం ఇప్పటికే ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ ఫిర్యాదుదారుల సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేస్తున్నారు.

– మనోహర్, ఎస్పీ

'పాలమూరు'తో సస్యశ్యామలం

- రాష్ట్ర మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- కొల్లాపూర్‌లో సీఎం కేసీఆర్ సభా ఏర్పాట్ల పరిశీలన

కొల్లాపూర్: ఉమ్మడి పాలమూరు జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు సీఎం కేసీఆర్ చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని రాష్ట్ర ఎక్సైజ్, క్రీడా, పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గురువారం ఆయన పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్టు పనులను పరిశీలించారు. ఎల్లూరు పంప్‌హౌజ్ వద్ద నిర్మాణాల గురించి నీటిపారుదల శాఖ అధికారులతో చర్చించారు. అంతకు ముందు కొల్లాపూర్‌లోని ఈదమ్మ గుడి సమీపంలో ఈ నెల 16న సీఎం కేసీఆర్ హాజరయ్యే సభ నిర్వహణ కోసం స్థలాన్ని ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు, కలెక్టర్ ఉదయ్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి సభా వేదిక, వాహనాల పార్కింగ్ వంటి అంశాలను మంత్రికి వివరించారు. అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడుతూ పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్టు ప్రారంభమైతే ఉమ్మడి మహబూబ్‌నగర్‌తోపాటు ఇతర జిల్లాలకు సైతం సాగు, తాగునీరు లభిస్తుందన్నారు. పాలమూరు ప్రాజెక్టులో అవసరమైనన్ని రిజర్వాయర్లను కేసీఆర్ ముందుచూపుతో నిర్మిస్తున్నారని చెప్పారు. నార్లాపూర్ రిజర్వాయర్ నుంచి కేఎల్‌ఐ ప్రాజెక్టు పరిధిలోని ఎల్లూరు రిజర్వాయర్‌కు లింకు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి కోరిన వెంటనే అనుమతించారన్నారు. కొల్లాపూర్ నియోజకవర్గం పర్యాటకంగా ఎంతో అభివృద్ధి చెందుతోందని, భవిష్యత్‌లో ఇంకా అభివృద్ధి సాధిస్తుందని పేర్కొన్నారు. ఆయన వెంట నాయకులు రఘువర్ధన్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, కమలేశ్వర్‌రావు, సురేందర్‌గౌడ్, వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

ట్రాక్టర్లను తరలిస్తున్న గూడ్స్ లారీల పట్టివేత

- వేలంలో కొని అనుమతి లేకుండా ఇతర రాష్ట్రాలకు తరలింపు
- కొనుగోలుదారుల మధ్య పోటీతో విషయం బయటకు



జడ్చర్ల: ఎలాంటి ధ్రువపత్రాలు లేకుండా ట్రాక్టర్లను గూడ్స్ లారీలలో తరలిస్తుండగా స్థానిక పోలీసులు గురువారం తెల్లవారుజామున పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే.. తెల్లవారుజామున 4 గంటల ప్రాంతంలో 167వ నంబర్ జాతీయ రహదారిపై శంకరాయపల్లి తండా గేటు వద్ద ట్రాక్టర్‌లను రవాణా చేస్తున్న రెండు గూడ్స్ లారీలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఒక్కో లారీలో 10 ట్రాక్టర్ల వరకు ఉన్నాయి. వీటిని మహబూబ్‌నగర్ శివారులోని రమేష్ పార్కింగ్ నుంచి గుజరాత్‌కు తరలిస్తున్నట్లుగా పోలీసుల దర్యాప్తులో తేలింది. ఫైనాన్స్‌లు తీసుకుని కొనుగోలు చేసిన ట్రాక్టర్లకు బకాయిలను రైతులు సకాలంలో చెల్లించకపోవడంతో వాటిని సీజ్ చేసి స్వాధీన పర్చుకుని నిర్ణీత గడువు ముగిసిన వెంటనే ఆన్‌లైన్‌లో వేలం వేస్తారు. ఈ వేలంలో కొనుగోలు చేసిన వ్యాపారులు ఇక్కడి నుంచి రాష్ట్రం దాటించి గుజరాత్, ఇతర రాష్ట్రాలకు తరలించి అక్రమంగా సొమ్ము చేసుకుంటున్నట్లు తోటి కొనుగోలుదారులు విలేకరులకు తెలిపారు. టీఆర్ రిజిస్ట్రేషన్ మాత్రమే ఉన్న ట్రాక్టర్లను పూర్తి స్థాయిలో రిజిస్ట్రేషన్ చేయించకపోవడంతో రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు రావాల్సిన ఆదాయం రాకుండా పోతుందన్నారు. ఇతర రాష్ట్రాలకు తరలించి నకిలీ పత్రాలు సృష్టించి అక్కడ రిజిస్ట్రేషన్ చేసి విక్రయిస్తారని తెలిపారు. తాము కూడా ఇలా ట్రాక్టర్లను ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసి ఇక్కడే పూర్తి స్థాయిలో రిజిస్ట్రేషన్ చేయించి ఇక్కడే విక్రయిస్తామన్నారు. కొందరు అక్రమ వ్యాపారులు మాత్రం ఇక్కడ రిజిస్ట్రేషన్ చేయించకుండా టీఆర్ పైనే ఇతర రాష్ట్రాలకు తరలించి ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారని ఆరోపించారు. ఈ వ్యాపారం భారీగా జరుగుతుందని, ప్రతి నెల రూ.కోట్లల్లో వ్యవహారం సాగుతుందన్నారు. దీనిపై రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ అధికారులు పూర్తి స్థాయిలో దృష్టి సారించి చర్యలు చేపట్టాలని కోరారు.

కేసు నమోదు..

అక్రమంగా తరలుతున్న ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని జిల్లా రవాణా శాఖ అధికారులకు సమాచారం ఇచ్చామని, వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని స్థానిక సీఐ రమేష్‌బాబు తెలిపారు. వాహనాల తనిఖీలో భాగంగా తమ సిబ్బంది ట్రాక్టర్లను తరలిస్తున్న లారీలను ఆపి పత్రాలు అడగడంతో తమ వద్ద ఎలాంటి అనుమతి పత్రాలు లేవని డ్రైవర్లు చెప్పడంతో వాహనాలను స్వాధీన పర్చుకున్నామని తెలిపారు.

వైద్యం కోసం వెళ్లొస్తుండగా..

- బైక్‌ను ఢీకొన్న కారు
- తల్లీ, కుమారుడు మృతి, తండ్రి పరిస్థితి విషమం
- మరుసటి రోజు తిరుపతి వెళ్లేందుకు కుటుంబం సిద్ధమవుతుండగానే ఘటన..


తల్లి అనురాధ, కుమారుడు శివ (ఫైల్)

మరికల్: ఎంతో సంతోషంగా తీర్థయాత్రకు వెళ్లేందుకు సిద్ధమైన ఆ కుటుంబంలో రోడ్డు ప్రమాదం పెనువిషాదాన్ని నింపింది. ప్రమాదంలో తల్లీ, కుమారుడు మృతి చెందగా, తండ్రి తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వివరాల్లోకి వెళితే.. మండల కేంద్రానికి చెందిన బొంత వెంకటేష్ భార్యాపిల్లలతో గురువారం తిరుపతికి వెళ్లేందుకు సిద్ధమయ్యాడు. కుమారుడు శివ(12) ఒంటిపై దద్దుర్లు కన్పించడంతో విష పురుగు కరిచిందని అనుమానంతో భార్య అనురాధ(35)తో కలిసి నాటు వైద్యం కోసం బుధవారం మహబూబ్‌నగర్ రూరల్ మండలం మనికొండకు బైక్‌పై వెళ్లారు. అక్కడ నాటువైద్యం చేయించుకున్నారు. మరుసటి రోజు ఉదయం తిరుపతికి వెళ్లాలనే ఉద్దేశంతో అక్కడి నుంచి రాత్రి 11 గంటలకు మరికల్‌కు తిరిగి బయల్దేరారు. మరికల్ మండలం తీలేర్ స్టేజీ సమీపంలో ఓ రైస్‌మిల్లు వద్ద జాతీయ రహదారిపై బైక్‌పై వస్తున్న వెంకటేష్ భార్య, కుమారుడిని కర్ణాటక నుంచి వస్తున్న కారు వేగంగా ఢీకొట్టడంతో ముగ్గురు ఎగిరి రోడ్డుపై పడ్డారు. ఆ సమయంలో బైక్ వెనకాలే వస్తున్న ఇతర వాహనాలు వారిపై నుంచి వెళ్లడంతో అనురాధ, శివ అక్కడికక్కడే మృతి చెందారు. వెంకటేష్ పరిస్థితి తీవ్ర విషమంగా ఉండటంతో మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. జిల్లా ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం తల్లి, కుమారుడి మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ ప్రమాదంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

జడ్చర్ల సమీపంలో పట్టుబడిన కారు డ్రైవర్

బైక్‌ను ఢీకొట్టిన కారును డ్రైవర్ రెండు కిలో మీటర్ల దూరంలో పెద్దచింతకుంట స్టేజి వద్ద నిలిపి ప్రమాదంలో ఊడిపోయిన 'స్పేర్‌పార్ట్స్'ను సరిచేసుకుని వేగంగా హైదరాబాద్ వైపు వెళ్లాడు. వెనకాలే వస్తున్న మరో కారు గమనిస్తూ వెంబడించారు. జడ్చర్ల వద్ద ఓ మెకానిక్ షాపు దగ్గర ఆగిన కారు డ్రైవర్‌ను పట్టుకుని నిలదీశారు. 100కి ఫోన్ చేసి పోలీసులకు కారు డ్రైవర్‌ను పట్టించారు. జడ్చర్లకు వెళ్లిన మరికల్ పోలీసులు ప్రమాదానికి కారణమైన కారుతో పాటు డ్రైవర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చినట్లు ఏఎస్‌ఐ శంకరయ్య తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


జడ్చర్లలో పట్టుబడిన కారు

గడ్డి మందు తాగి యువకుడి ఆత్మహత్య


తిరుమలేష్(ఫైల్)

ధరూరు: తండ్రి మందలించాడని ఓ యువకుడు గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని జాంపల్లిలో చోటు చేసుకుంది. పోలీసుల, గ్రామస్తుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన హనుమంతు, భాగ్యమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. వారిలో చిన్న వాడైన తిరుమలేష్(21) డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఇటీవలే టీసీ తీసుకున్న తిరుమలేష్ తాను ఎల్‌ఎల్‌బీ చదువుతానని, తనకు రూ.లక్ష కావాలని ఇంట్లో తల్లిదండ్రులను అడిగాడు. ఫీజు మేమే వచ్చి చెల్లిస్తామని, డబ్బులు ఇవ్వనని తండ్రి మందలించాడు. అందుకు మనస్తాపం చెందిన యువకుడు మంగళవారం సాయంత్రం గడ్డి మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. బుధవారం రాత్రి చికిత్స పొందుతూ కర్నూలులో మృతి చెందాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శివానందంగౌడ్ తెలిపారు.

క్లుప్తంగా...



మార్గదర్శి దందాపై విచారించాలి

హైకోర్టుకు నివేదించిన సీఐడీ.. అప్పీళ్లు దాఖలు

సాక్షి, అమరావతి: మార్గదర్శి చిట్‌ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్ ఆర్థిక అవకతవకలు, తప్పుడు రికార్డుల నిర్వహణ, నిధుల మళ్లింపు, ఇతర చట్ట ఉల్లంఘనలపై రామోజీ, శైలజా కిరణ్ తదితరులపై నమోదు చేసిన కేసులో తాము దాఖలు చేసిన చార్జిషీట్‌లను గుంటూరు, విశాఖపట్నంలోని డిపాజిటర్ల పరిరక్షణ చట్టం ప్రత్యేక కోర్టులు 'రిటర్న్' చేస్తూ గత నెల 28న జారీ చేసిన ఉత్తర్వులను సవాలు చేస్తూ ఏపీ సీఐడీ హైకోర్టును ఆశ్రయించింది. ఈ ఉత్తర్వులను రద్దు చేయడంతో పాటు, కేసును విచారణకు స్వీకరించేలా ఆ కోర్టులను ఆదేశించాలని కోరుతూ సీఐడీ అదనపు ఎస్పీ ఈ అప్పీళ్లను దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాల్లో మార్గదర్శి చైర్మన్ చెరుకూరు రామోజీరావు, ఎండీ శైలజా కిరణ్, ఆడిటర్ కుదరవల్లి శ్రవణ్‌లతో పాటు వైస్ ప్రెసిడెంట్లు, డైరెక్టర్లు, జనరల్ మేనేజర్లు, బ్రాంచ్ మేనేజర్లు ఇలా మొత్తం 15 మందిని ప్రతివాదులుగా పేర్కొన్నారు. ఈ అప్పీళ్లపై హైకోర్టు వచ్చే వారం విచారణ జరిపే అవకాశం ఉంది.

ప్రజలందరికీ.. 'ఆరోగ్య సురక్ష'

సాక్షి, అమరావతి/చిలకలూరిపేట: ఏపీ ప్రజలందరి ఆరోగ్య రక్షణ లక్ష్యంగా వైఎస్ జగన్ ప్రభుత్వం మరో విప్లవాత్మక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలందించేందుకు 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని చేపట్టింది. ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించడం, ప్రాథమిక పరీక్షలతో ఆరోగ్య సమస్యలను గుర్తించడంతో పాటు వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి స్పెషలిస్ట్ డాక్టర్లు, పీహెచ్‌సీ డాక్టర్లు, ఇతర వైద్య సిబ్బంది ద్వారా చికిత్సలు, మందులను ఉచితంగా అందించబోతోంది. ఎవరైనా రోగులకు అవసరమైతే ప్రభుత్వాస్పత్రులు, ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు రిఫర్ చేసి వైద్య చికిత్సలు చేయించనుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆదేశాల మేరకు ఈనెల 15 నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ చర్యలు చేపట్టింది.

చెప్పింది చేయండి

▶ మొదటి పేజీ తరువాయి

నిర్వహిస్తోంది. ఇతరత్రా సేకరించిన వారి గుర్తింపు కార్డులతో వ్యవహారం నడుపుతోంది. వారి సంతకాలను ఫోర్జరీ చేస్తూ తీవ్ర నేరానికి పాల్పడుతోంది.

- ఘోస్ట్ చందాదారుల పేరిట చెక్‌లు జారీ చేస్తున్నప్పటికీ, ఆ చెక్కులను మార్గదర్శి చిట్ ఫండ్స్ యాజమాన్యం వారి వద్దే అట్టిపెట్టుకుంటోంది. ఆ చెక్కుల వివరాలను రికార్డుల్లో నమోదు చేయడం లేదు. బ్యాంకులో జమ చేయడం లేదు. ఇదో అతి పెద్ద ఆర్థిక మోసం. అలాంటి 3 వేల మంది ఘోస్ట్ చందాదారుల్లో వంద మందిని సీఐడీ విచారిస్తోంది.
- దాంతో బెంబేలెత్తిన మార్గదర్శి యాజమాన్యం ఆ ఘోస్ట్ చందాదారులకు ఫోన్లు చేసి బెదిరిస్తోంది. సీఐడీ దర్యాప్తునకు సహకరించవద్దని, తర్వాత తాము అన్నీ సెటిల్ చేస్తామని.. లేకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరిస్తోంది. మార్గదర్శి ఎండీ శైలజా కిరణ్ తన పీఏ శశికళ ద్వారా చందాదారులకు ఫోన్లు చేసి బెదిరిస్తున్నారు.

అక్రమ డిపాజిట్లుగా నల్లధనం

- రిజర్వ్ బ్యాంక్ నిబంధనలకు విరుద్ధంగా మార్గదర్శి చిట్ ఫండ్స్ అక్రమ డిపాజిట్లు సేకరిస్తోంది. దీనిపై ప్రశ్నిస్తే తిరిగి బుకాయిస్తోంది. రాబోయే నెలలకు చిట్టీ గ్రూపులకు చెల్లించాల్సిన చందాలను అడ్వాన్స్‌గా జమ చేస్తున్నారని వక్రీకరించేందుకు ప్రయత్నిస్తోంది. కానీ అసలు చిట్టీ గ్రూపులు మొదలు కాకుండానే చందాదారుల పేరిట నాలుగైదు నెలల ముందే డిపాజిట్లు సేకరించిన విషయాన్ని సీఐడీ గుర్తించింది.
- చిట్టీ గ్రూపులు మొదలు కాకుండానే ఎవరైనా చందాల మొత్తం చెల్లిస్తారా? ఎవరూ చెల్లించరు కాబట్టి అవి అక్రమ డిపాజిట్లే. రాష్ట్రంలోని మార్గదర్శి చిట్‌ఫండ్స్ చందాదారులు దాదాపు 2 వేల మందిలో రూ.కోటికి పైగా విలువైన అక్రమ డిపాజిట్లు చేసిన, చిట్టీ గ్రూపుల్లో చందాదారులుగా ఉన్న వారు ఏకంగా 800 మందికిపైగా ఉన్నారు. చాలా కంపెనీల పేరిట భారీగా అక్రమ డిపాజిట్లు సేకరించారు.



- ఆ 800 మందికిపైగా డిపాజిట్‌దారులకు సీఐడీ నోటీసులు జారీ చేసింది. అంత భారీగా డిపాజిట్లు ఎలా చేశారు.. ఆ నిధులు ఏ ఆదాయ మార్గాల ద్వారా వచ్చాయనే కోణంలో విచారిస్తోంది. విజయవాడలో ఓ బిల్డర్ ఏకంగా రూ.50 కోట్ల విలువైన చిట్టీ గ్రూపుల్లో చందాదారునిగా ఉన్నారు.
- ఇలాంటి భారీ మొత్తాల డిపాజిట్‌దారులు, చిట్టీ గ్రూపుల్లో సభ్యుల గురించి ఆదాయ పన్ను శాఖ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులకు కూడా సీఐడీ సమాచారమిచ్చింది. అక్రమ డిపాజిట్ల ముసుగులో నల్లధనం చెలామణిలోకి తీసుకువస్తున్నారా అన్నది సీఐడీతోపాటు కేంద్ర దర్యాప్తు సంస్థలు పరిశీలించాల్సిన అవసరం ఉందని భావిస్తోంది.

రూ.9.43 కోట్ల జగజ్జనని చిట్ ఫండ్స్ ఆస్తులు అటాచ్

కేంద్ర చిట్ ఫండ్స్ చట్టాన్ని ఉల్లంఘిస్తూ అక్రమాలకు పాల్పడిన రాజమహేంద్రవరానికి చెందిన జగజ్జనని చిట్ ఫండ్స్‌కు చెందిన రూ.9,43,52,020 విలువైన స్థిరాస్తులను అటాచ్ చేయాలని సీఐడీ నిర్ణయించింది. వాటిలో భవనాలు, భూములు, ఖాళీ స్థలాలతో కూడిన మొత్తం 12 స్థిరాస్తులను అటాచ్ చేయనుంది. చందాదారుల ప్రయోజనాల పరిరక్షణ కోసం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు సీఐడీ ప్రతిపాదనకు హోమ్ శాఖ ఆమోదిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై న్యాయస్థానం ఆమోదం కోసం సీఐడీ పిటిషన్ దాఖలు చేయనుంది. న్యాయస్థానం అనుమతి అనంతరం ఆ ఆస్తులను అటాచ్ చేస్తుంది.

ఏజెంట్లకూ కుచ్చుటోపి

- మార్గదర్శి చిట్ ఫండ్స్ తమ చందాదారులు, ఏజెంట్లను కూడా మోసగిస్తోంది. కుట్ర పూరితంగా వారిని అప్పుల ఊబిలోకి నెట్టేస్తూ వారి ఆస్తులు రాయించుకుంటోంది. దీనిపై చందాదారులు, ఏజెంట్లు, ఘోస్ట్ చందాదారుల నుంచి భారీగా ఫిర్యాదులు వస్తున్నాయి. వాటిని పరిశీలించి తగిన ఆధారాలు ఉన్న వాటిపై సీఐడీ కేసులు నమోదు చేస్తోంది.
- విజయవాడలో కోళ్ల ఫారం యజమాని బొండు అన్నపూర్ణా దేవి అనే మహిళను ఏకంగా 65 చిట్టీ గ్రూపుల్లో చందాదారునిగా చేర్పించి ఆమెను అప్పుల ఊబిలోకి నెట్టేశారు. కుట్ర పూరితంగా విజయవాడలోని లబ్బీపేట, గుడివాడ మార్గదర్శి చిట్ ఫండ్స్ కార్యాలయాలు కేంద్రంగా ఈ మోసానికి పాల్పడ్డారు. విదేశాల్లో ఉన్న ఆమె కుమార్తె ప్రియాంక సంతకాన్ని కూడా ఫోర్జరీ చేశారు. ష్యూరిటీలు ఇచ్చినా సరే కొర్రీలు వేస్తూ ఆమెను డిఫాల్టర్‌గా చూపిస్తూ వారి ఆస్తులు కూడా రాయించుకున్నారు. దీనిపై ఆమె ఫిర్యాదు చేయడంతో మంగళగిరి సీఐడీ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశాం. ఆమె రూ.14 కోట్ల విలువైన 65 చిట్టీ గ్రూపుల్లో చందాదారుగా ఉన్నారు. ఆమె రూ.8 కోట్లు చందా మొత్తం చెల్లించారు. కానీ చిట్టీ పాట పాడితే ఆమె చేతికి ఇచ్చింది కేవలం రూ.48 లక్షలు మాత్రమే. ఇందులో రూ.8 కోట్ల విలువైన 45 చిట్టీ గ్రూపుల్లో ఆమె రూ.1.7 కోట్లు చందా మొత్తంగా చెల్లిస్తే.. చిట్టీ పాట పాడిన తర్వాత ఆమె చేతికి ఇచ్చింది కేవలం రూ.8 వేలు. ఆమెను డిఫాల్టర్‌గా చూపిస్తూ వారి కుటుంబ ఆస్తులు కూడా రాయించుకుంటున్నారు.
- విశాఖపట్నం కంచరపాలెంకు చెందిన పిలక లలిత కుమారి ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగి. ఆమెను విశాఖపట్నంలోని డాబా గార్డెన్స్ మార్గదర్శి చిట్ ఫండ్స్ బ్రాంచి కార్యాలయంలో రూ.5 లక్షల చిట్టీ గ్రూపులో ఘోస్ట్ చందాదారుగా చేర్చారు. ఆ విషయం తెలిసి ఆమె చిట్ రిజిస్ట్రార్‌ను ఆశ్రయించారు. అక్కడ ఉన్న పత్రాల్లో ఉన్న సంతకాలు చూసి అవి తాను చేయలేదని ఫోర్జరీ చేశారని తెలిపారు.
- ఆమె చిట్టీ పాడినట్టు.. ఆమెకు చిట్టీ మొత్తం చెల్లించినట్టు కూడా రికార్డుల్లో ఉంది. అందుకు ఇద్దరు సాక్షి సంతకాలు కూడా చేశారు. తనకు తెలియకుండానే తనను చందాదారుగా చేర్చడంతోపాటు తన సంతకాలు ఫోర్జరీ చేయడంపై లలిత కుమారి విశాఖపట్నం టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దాంతో విశాఖపట్నం డాబా గార్డెన్స్ మార్గదర్శి చిట్‌ఫండ్స్ బ్రాంచి మేనేజర్ యలమంచిలి బాబూ రాజేంద్ర ప్రసాద్, మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఏజెంట్ కె.సంతోష్, సాక్షి సంతకాలు చేసిన జి.నరసింగరావుపై పోలీసులు కేసు నమోదు చేశారు. మార్గదర్శి చిట్ ఫండ్స్, ఎండీ శైలజా కిరణ్, ఆమె పీఏ శశికళ, విజయవాడ లబ్బీపేట బ్రాంచి మేనేజర్ బందారు శ్రీనివాసరావు, గుడివాడ బ్రాంచి మేనేజర్ వైవీవీడీ ప్రసాద్, పాతూరి రాజాజీ, పాపి నాయుడులను నిందితులుగా పేర్కొంటూ ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.
- పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో మార్గదర్శి చిట్ ఫండ్స్ ఏజెంట్‌నే ఆ సంస్థ మోసం చేసింది. ఏజెంట్ సంతకాన్ని బ్రాంచి మేనేజర్ ఫోర్జరీ చేశారు. ఏజెంట్ ఫిర్యాదుపై సీఐడీ అధికారులు కేసు నమోదు చేశారు. వివరాలు త్వరలోనే వెల్లడించనున్నారు.

మా కుటుంబాన్ని దోచేసి రోడ్డున పడేశారు

- బోరున విలపించిన బొండు అన్నపూర్ణా దేవి

'మార్గదర్శి చిట్ ఫండ్స్ మమ్మల్ని పూర్తిగా మోసం చేసి ఆర్థికంగా కుదేలయ్యేట్టు చేసింది. మా కుటుంబాన్ని రోడ్డున పడేసింది. మా ఆస్తులు, బంగారం, వృద్ధాప్యంలో అవసరాల కోసం దాచుకున్న మొత్తం అంతా మార్గదర్శి చిట్ ఫండ్స్‌కు ధారపోశాం. అయినా సరే ఇంకా మమ్మల్ని వేధిస్తూ మిగిలిన ఉన్న ఇంటిని కూడా తీసుకునేందుకు వేధిస్తోంది. మా కుమార్తె సంతకాన్ని కూడా ఫోర్జరీ చేసి మోసానికి పాల్పడింది. నా భర్త ప్రభుత్వ వెటర్నరీ వైద్యుడు. నేను కోళ్ల ఫారం నిర్వహిస్తున్నాను. నేను మార్గదర్శి చిట్ ఫండ్స్‌లో ఒక గ్రూపులో చందాదారుగా చేరాను. ఆ తర్వాత ఏకంగా 65 గ్రూపుల్లో నన్ను చందాదారుగా చేర్చింది. నిబంధనల ప్రకారం మేము ఇచ్చిన ష్యూరిటీలను కూడా గుర్తించకుండా ఉద్దేశ పూర్వకంగా మమ్మల్ని 17 చిట్టీ గ్రూపుల్లో డిఫాల్టర్‌గా చూపించింది. మా ఆస్తు లు తీసుకుంది. నా భర్త జీపీఎఫ్ డబ్బులు కట్టి, పిల్లల పెళ్లి కోసం దాచుకున్న బంగారం కూడా అమ్మి చెల్లించాం. అయినా సరే ఇంకా బకాయి ఉన్నారంటూ మా ఇల్లు వేలం వేయించారు. మా ఇంటికి వచ్చి అల్లరి చేశారు. మా అమ్మాయి విదేశాల్లో వైద్య విద్య చదువుతోంది. ఆమె సంతకాన్ని కూడా ఫోర్జరీ చేసి చందాదారుగా చేర్చారు. ఆమె చిట్టీ పాట పాడినట్టు చూపించా రు. రూ.9 లక్షల నష్టానికి చిట్టీ పాట పాడినట్టు చూపించి బకాయిలు మినహాయించుకుని కేవలం రూ.210 మాత్రమే ఇస్తామని రికార్డుల్లో సర్దుబాటు చేశారు. ఆ చిట్టీ గ్రూపునకు సంబంధించి వాయిదాల బకాయిలు చెల్లించాలని మమ్మల్ని వేధిస్తున్నారు. అసలు ఈ దేశంలోనే లేని మా కుమార్తె ఎలా చందాదారుగా చేరింది? ఎలా వేలం పాటలో పాల్గొంది? తను వచ్చి ఎప్పుడు సంతకం చేసింది? ఇంత దారుణంగా మార్గదర్శి చిట్‌ఫండ్స్ మమ్మల్ని మోసం చేసింది. మమ్మల్ని కుట్ర పూరితంగా అప్పుల ఊబిలో కూరుకుపోయేలా చేసిన మార్గదర్శి చిట్ ఫండ్స్ యాజమాన్యం, మేనేజర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నా.'

ఆలస్యంగా ఆశ్రయించడం సమర్థనీయం కాదు

నీట్ పరీక్ష రాసిన విద్యార్థిని తప్పుబట్టిన హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: వైద్యవిద్యలో 'స్థానిక'సీట్ల భర్తీకి సంబంధించి ఇప్పటికే దాఖలైన పలు పిటిషన్లపై తీర్పును రిజర్వు చేశామని, ఇప్పుడు మరో పిటిషన్‌పై విచారణ చేపట్టలేమని హైకోర్టు తేల్చిచెప్పింది. ఇంత ఆలస్యంగా కోర్టును ఆశ్రయించడాన్ని సమర్థించలేమని స్పష్టం చేసింది. వైద్యవిద్య సీట్ల భర్తీ అనేది కాలపరిమితితో కూడిందని, ఇప్పటికే రెండుసార్లు కౌన్సెలింగ్ కూడా ముగిసిందని చెప్పింది. ఆగస్టు 2వ తేదీనే నాన్ లోకల్‌గా పేర్కొన్నా 31వ తేదీ వరకు పిటిషనర్ ఎలాంటి చర్యలు చేపట్టకపోవడాన్ని తప్పుబట్టింది. పిటిషన్‌ను కొట్టివేసింది. ఇంటర్మీడియట్ స్థానికంగా చదవకుంటే నీట్‌లో లోకల్ కోటా (85 శాతం) కిందికి రారంటూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 114ను సవాల్ చేస్తూ రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం కొత్తపల్లెకు చెందిన విద్యార్థి శ్రీస్వరాజ్ రవీందర్ నాగపుర్తి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. లోకల్‌గా పరిగణించకుంటే కేవలం 15 శాతం సీట్లలోనే తాము పోటీపడాల్సి ఉంటుందని, ఇది చట్టవిరుద్ధమ ని పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై ప్రధానన్యాయ మూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ ఎన్‌వీ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. వాదనలు విన్న ధర్మాసనం న్యాయసూత్రాల మేరకు కొన్నిసార్లు ఆలస్యం అనేది న్యాయాన్ని పొందకుండా చేస్తుందని వ్యాఖ్యానించింది. ఇలాంటివారి హక్కుల పరిరక్షణకు ఎలాంటి ఉపశమన ఆదేశాలు ఇవ్వలేమంటూ పిటిషన్‌ను కొట్టివేసింది.

12న వడ్డెర ప్రతినిధుల మహాసభ

పంజగుట్ట: తెలంగాణ రాష్ట్రం వస్తే వడ్డెర కులస్తులకు న్యాయం జరుగుతుందనే ఆశాభావంతో ఉద్యమంలో ముందుండి పోరాడితే ఉమ్మడి ఏపీలో ఉన్న హక్కులు కూడా ప్రత్యేక రాష్ట్రంలో లేకుండా చేస్తూ అధఃపాతాళానికి తొక్కేస్తున్నారని తెలంగాణ రాష్ట్ర వడ్డెర సంఘం ఆవేదన వ్యక్తం చేసింది. వడ్డెరల సమస్యలు చర్చించేందుకు ఈ నెల 12న బాగ్‌లింగంపల్లి సుందరయ్య కళానిలయంలో వడ్డెర సంఘం ప్రతినిధుల మహాసభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మహాసభ పోస్టర్‌ను గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో వ్యవస్థాపక అధ్యక్షుడు పల్లపు సమ్మయ్య, అధ్యక్షుడు ద్యారంగుల నగేశ్, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు శివరాత్రి దుర్గయ్య ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో 20 లక్షల జనాభా ఉన్న వడ్డెర కులస్తులకు బీఆర్ఎస్ పార్టీ ఒక్క సీటు కూడా కేటాయించలేదన్నారు. ఇప్పటికైనా అన్ని పార్టీలు కనీసం 4 సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. వడ్డెర పిల్లలకు గురుకులాల్లో ఎంట్రెన్స్ లేకుండా సీట్లు ఇవ్వాలన్నారు. మహాసభకు హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్, కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు హాజరవుతారని తెలిపారు. సమావేశంలో నాయకులు ఐలయ్య, పి.నవీన్ తదితరులు పాల్గొన్నారు.

జోగులాంబాదేవిని దర్శించుకున్న ప్రముఖులు



జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయాలను గురువారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఎమ్మెల్సీ చల్లా వెంకటరామిరెడ్డి, వనపర్తి ఎఫ్ఆర్‌ఓ రాజశేఖర్, మహబూబ్‌నగర్ ఎస్సీ, ఎస్టీ కోర్టు న్యాయమూర్తి ఆర్.శ్రీదేవి, కుటుంబ సభ్యులు వేర్వేరు సమయాలలో దర్శించుకున్నారు. వారికి ఆలయ అర్చకులు సాదర స్వాగతం పలికి ఉభయ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేయించారు. తీర్థ, ప్రసాదాలు అందజేసి శేషవస్త్రాలతో వారిని సత్కరించారు. ఎఫ్ఆర్‌ఓ రాజశేఖర్ బంగారు ముక్కు పుడకను అమ్మవారికి బహూకరించారు.

మహిళ అదృశ్యం

గద్వాల క్రైం: మహిళ అదృశ్యమైన ఘటన పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పట్టణంలోని పిల్లిగుండ్ల కాలనీకి చెందిన ఓ మహిళ గురువారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లింది. సాయంత్రమైనా తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు.

కర్ణాటక ఫలితాలే తెలంగాణలో..

- దేశచరిత్రలో నిలిచిపోయిన 'భారత్ జోడో యాత్ర'
- సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్‌రెడ్డి



క్లాక్‌టవర్‌లో కాగడాలతో నినాదాలు చేస్తున్న వంశీచంద్‌రెడ్డి, జిల్లా నాయకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: కర్ణాటక రాష్ట్ర శాసనసభ ఫలితాలే తెలంగాణతోపాటు నాలుగు రాష్ట్రాల్లో రానున్నాయని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు, ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడోయాత్ర ఏడాది పూర్తయిన సందర్భంగా గురువారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయం నుంచి నాయకులు, కార్యకర్తలు బస్టాండ్, అశోక్‌టాకీస్ చౌరస్తా మీదుగా క్లాక్‌టవర్ వరకు కాగడాలతో పాదయాత్ర చేపట్టారు. అనంతరం డీసీసీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్నర్ సమావేశంలో వంశీచంద్‌రెడ్డి ప్రసంగించారు. దేశంలో విద్వేషాలకు వ్యతిరేకంగా రాహుల్ గాంధీ కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు 4,081 కిలోమీటర్ల పాదయాత్ర చేపట్టినట్లు తెలిపారు. దేశచరిత్రలో రాహుల్‌గాంధీ భారత్‌జోడోయాత్ర నిలిచిపోతుందన్నారు. దేశంలోని దోపిడిని అరకట్టడానికి, పేద ప్రజలకు అండగా నిలవాలనే ఉద్దేశంతో భారత్ జోడో యాత్ర నిర్వహించినట్లు తెలిపారు. ఈ యాత్రతో రాహుల్‌గాంధీకి వచ్చిన ఆదరణ చూసి భయపడిన బీజేపీ ఆయన పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దుచేసే ప్రయత్నం చేసిందని ఆరోపించారు. కర్ణాటక రాష్ట్ర ఫలితాలు కేవలం ఆ రాష్ట్రానికి కాకుండా దేశం మొత్తానికి ప్రభావితం చూపుతుందన్నారు. బీజేపీ ఎన్ని కుట్రలు చేసినా, ముందస్తు దేశం మొత్తం ఎన్నికల్లో పెట్టినా కాంగ్రెస్ పార్టీ విజయాన్ని ఆపలేరని అన్నారు. ఉమ్మడి జిల్లాలో రానున్న ఎన్నికల్లో 14 స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థుల విజయం కోసం నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని కోరారు.

ఆసక్తి రేపిన సంజీవ్‌ముదిరాజ్ వ్యాఖ్యలు

భారత్ జోడో సమ్మేళన్ సమావేశంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్ వ్యాఖ్యలు ఆసక్తి రేపాయి. కాంగ్రెస్ పార్టీకి 135 ఏళ్ల చరిత్ర ఉందని, కార్యకర్తలు లేనట్లు ఎవరో వచ్చి పార్టీలో చేరకముందే వాళ్లే పోటీ చేస్తారనే ప్రచారం జరుగుతున్నదని, కానీ స్థానికులే ఇక్కడ పోటీ చేస్తారని తెలిపారు. కేవలం కొంత మంది వారి స్వార్థం కోసం పార్టీని వదిలిపెట్టిపోతారు.. వస్తారని, నియోజకవర్గంలో స్థానిక నాయకులే పోటీ చేస్తారన్న వ్యాఖ్యలు సమావేశంలో కలకలం రేగాయి. కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు ఒబేదుల్లా కొత్వాల్, ప్రధాన కార్యదర్శులు వినోద్‌కుమార్, ప్రదీప్‌గౌడ్, ప్రశాంత్‌రెడ్డి, అధికార ప్రతినిధులు హర్షవర్ధన్‌రెడ్డి, జహీర్ అఖ్తర్, నాయకులు చంద్రకుమార్‌గౌడ్, బెనహర్, వసంత, సాయిబాబా, ఫయాజ్, బెక్కరి అనిత, సిరాజ్ ఖాద్రీ, బాల్‌చందర్‌గౌడ్, రాములుయాదవ్, లక్ష్మణ్‌యాదవ్, లింగంనాయక్, అవేజ్, అజ్మత్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

చిన్నోనిపల్లెను నీటిలో ముంచాలనుకున్నారా?

- బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ
- ముంపు గ్రామం సందర్శన



చిన్నోనిపల్లె గ్రామస్తులతో మాట్లాడుతున్న డీకే అరుణ

గట్టు: చిన్నోనిపల్లె ముంపు గ్రామస్తుల సమస్యలను పట్టించుకోకుండా రిజర్వాయర్ కట్ట బండింగ్ పనుల చేపట్టడంతో వర్షపు నీరు గ్రామంలోకి చేరుతున్నాయని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ తెలిపారు. గురువారం చిన్నోనిపల్లె ముంపు గ్రామాన్ని ఆమె సందర్శించారు. ముంపు గ్రామస్తుల సమస్యలపై ఆరా తీశారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం పదేళ్లు అవుతున్నా రిజర్వాయర్ పనులను చేపట్టలేదన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న తరుణంలో ఆలూరు పునరావాస కేంద్రం పూర్తి చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం వర్షపు నీరు వచ్చి చేరడంతో చిన్నోనిపల్లె గ్రామస్తులు ఆందోళన చెందుతున్నట్లు తెలిపారు. అధికారులు స్పందించి పునరావాస కేంద్రంలో సౌకర్యాలు కల్పించి, సమస్యలను పరిష్కరించాలని, లేకుంటే ముంపు గ్రామస్తుల తరపున తాను పోరాటం చేయాల్సి వస్తుందన్నారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా చిన్నోనిపల్లె పనులు అసంపూర్తిగా నిలిచినట్లు ఆరోపించారు. 16 ఏళ్లు గడుస్తున్నా ప్రభుత్వం తట్టెడు మట్టి వేయకపోవడం, ఎన్నికలు వస్తుండడంతో గ్రామస్తులను భయభ్రాంతులకు గురిచేసి, కేసులు పెట్టి పనులు మొదలు పెట్టిందని విమర్శించారు. 16 ఏళ్ల తర్వాత ముంపు గ్రామస్తులకు పాత రేట్ల ప్రకారం పరిహారం ఇవ్వడం అన్యాయమన్నారు. ప్రభుత్వం చెల్లించే పరిహారం పునరావాస కేంద్రంలో రేకుల షెడ్లు కూడా వేసుకోవడానికి సరిపోవన్నారు. మాయమాటలు చెప్పి పనులు చేసే అధికారులు ముంపు గ్రామస్తుల సమస్యలను పరిష్కరించకపోతే తాను నిర్వాసితుల పక్షాన నిలబడి పోరాటం చేస్తానని హెచ్చరించారు. కార్యక్రమంలో కృష్ణారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, ఆనంద్, శివారెడ్డి, మధుసూదన్‌రావు, మల్లికార్జున్, శ్రీనివాసరెడ్డి, గోవర్ధన్‌గౌడు, వీరన్న, వీరేష్, భాస్కర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

జూరాలకు తగ్గిన ఇన్ ఫ్లో

ధరూరు/ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుంచి భారీగా ఇన్‌ఫ్లో వస్తున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. బుధవారం సాయంత్రం 7 గంటల వరకు ప్రాజెక్టుకు ఎగువ నుంచి 38,600 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, గురువారం సాయంత్రానికి ప్రాజెక్టుకు 25,500 క్యూసెక్కులకు తగ్గిపోయినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ఆవిరిరూపంలో 70, ఎడమ కాల్వకు 640 క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి మొత్తం 16,758 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 9.657 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 8.969 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువన ఉన్న ఆల్మట్టి ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 129.72 టీఎంసీలు కాగా ప్రస్తుతం 118.052 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఈ ప్రాజెక్టుకు 358 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, ప్రాజెక్టు నుంచి 5వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. నారాయణపూర్ ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 37.64 టీఎంసీలు కాగా, ప్రస్తుతం ప్రాజెక్టులో 25.58 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఈ ప్రాజెక్టుకు 6,745 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, 7,570 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

ఐదుయూనిట్లలో విద్యుదుత్పత్తి

ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు దిగువ, ఎగువ జల విద్యుదుత్పత్తి కేంద్రాల్లో ఉత్పత్తి కొనసాగుతుంది. గురువారం 5 యూనిట్ల ద్వారా ఉత్పత్తి చేపట్టినట్లు ఎస్ఈ రామసుబ్బారెడ్డి, డీఈ పవన్‌కుమార్ తెలిపారు. ఎగువ కర్నాటక రాష్ట్రంలోని ఆల్మట్టి, నారాయణపూర్ డ్యాంల నుంచి వరద స్వల్పంగా చేరుతుండడంతో ఎగువలో 2 యూనిట్ల ద్వారా 78 మెగావాట్లు, 74.585 ఎం.యూ., దిగువలో 3 యూనిట్ల ద్వారా 120 మెగావాట్లు, 79.494 ఎం.యూ. విద్యుదుత్పత్తిని చేపడుతున్నామన్నారు. ఎగువ, దిగువ జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో ఇప్పటి వరకు 154.079 మిలియన్ యూనిట్ల ఉత్పత్తిని సాధించామని తెలిపారు.

573 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలోకి 573 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. బుధవారం ప్రాజెక్టులో పూర్తిస్థాయి నీటి మట్టం 1,021 అడుగులకు వచ్చి చేరింది. జూరాల ఎడమ కాల్వ, సమాంతర కాల్వ ద్వారా 573 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. సమాంతర కాల్వ నీటిని నిలిపివేశారు. ఎన్టీఆర్ కాల్వ ద్వారా వ్యవసాయ అవసరాల కోసం 800 క్యూసెక్కులు, కుడి, ఎడమ కాల్వల ద్వారా 10 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు.



దిగువ జూరాల పవర్‌హౌజ్ కేంద్రం

కోయిల్‌సాగర్ 30.6 అడుగుల నీటిమట్టం

దేవరకద్ర: కోయిల్‌సాగర్‌లో గురువారం సాయంత్రం వరకు 30.6 అడుగులకు నీటిమట్టం చేరింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 32.6 అడుగులు కాగా కేవలం 2 అడుగుల నీరు చేరితే ప్రాజెక్టు గేట్లను తెరిచే అవకాశం ఉంది. జూరాల నుంచి ఎత్తిపోతల ద్వారా విడుదల చేస్తున్న నీటిని రెండు రోజుల నుంచి నిలిపి వేశారు. కుడి, ఎడమ కాల్వల ద్వారా నీటి విడుదలను నిలిపివేయడంతో ప్రాజెక్టు నీటిమట్టం పెరుగుతున్నది. మరో రెండు మూడు రోజుల్లో ప్రాజెక్టు పూర్తిగా నిండే అవకాశం ఉంది.

దళితులకు ఉచిత విద్యుత్ కోసం ఉద్యమం

- కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు



మాట్లాడుతున్న కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు

మహబూబ్‌నగర్ రూరల్: నిరుపేద దళితులకు గృహ అవసరాలకు 300 యూనిట్ల ఉచిత విద్యుత్ అమలు కోసం రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేపడతున్నామని, దళితులు రాజకీయాలకు అతీతంగా భాగస్వాములు కావాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు పిలుపునిచ్చారు. గురువారం కేవీపీఎస్ జిల్లాస్థాయి సమావేశం జిల్లా ఉపాధ్యక్షుడు మాణిక్యంరాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ 342 జీఓ ప్రకారంగా 101 యూనిట్ల విద్యుత్ ఇవ్వాల్సి ఉండగా, దానిని 300 యూనిట్లకు పెంచాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న జీఓ కూడా అమలు కావడం లేదన్నారు. అర్హత ఉన్న ప్రతి దళిత కుటుంబానికి ఉచిత విద్యుత్ కోసం సెప్టెంబర్ నెల మొత్తం దశల వారి ఉద్యమాలు చేపడతామని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయిలో విద్యుత్ అధికారులు దళితులను మోసగిస్తున్నారని విమర్శించారు. ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు ట్రాన్స్‌కోకు అందుతున్నాయని, ప్రభుత్వం ఆ మేరకు ఉచిత కరెంట్ ఇవ్వకుండా దళితుల నుంచి మీటర్ల ద్వారా బిల్లులు వసూలు చేస్తుందన్నారు. భూస్వాములకు, పెట్టుబడిదారులకు, కార్పొరేట్ సంస్థలు, భూములు ఉన్న వారికి ఉచితంగా విద్యుత్ మోటార్లకు కరెంట్ ఇస్తున్నప్పుడు దళితుల గృహాలకు, సెంట్ భూమి లేని నిరుపేదలకు ఉచితంగా కరెంట్ ఇస్తే తప్పేమిటని ప్రశ్నించారు. తమిళనాడు మంత్రి తల నరికితే 10 కోట్లు ఇస్తామని ప్రకటించిన పరమహంస స్వామిజీని తక్షణమే హత్యానేరం కింద అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఒక భావం వ్యక్తపరిస్తే దానికి ప్రతిభావం వ్యక్తం చేయాలి, కానీ తల నరకడానికి సుపారి ప్రకటించడం అంటే నేరంలో భాగస్వాములు అవుతాడని చెప్పారు. ఎన్నికల ఏడాది కావడం వల్ల విద్వేషాలు రెచ్చగొట్టి రాజకీయం పబ్బం గడుపుకోవడానికి మనువాద శక్తులు పథకం ప్రకారం చేస్తున్న కుట్రలేనని విమర్శించారు. మణిపూర్‌లో మహిళలను నగ్నంగా ఊరేగింపు చేస్తే నోరు మెదపని మోదీ, అమిత్ షాలు తమిళనాడు మంత్రి చేసిన వ్యాఖ్యలపై స్పందించడం సిగ్గుచేటన్నారు. విద్వేషాలు రెచ్చగొట్టకుండా రాజ్యాంగ బద్ధంగా, చట్టబద్ధంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కుర్మయ్య, సత్యం, వెంకట్రాములు, బాలరాజు, రాములు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.